

రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు

గత ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ జరిగేదని, కూటమి ప్రభుత్వంలో పంపిణీ సక్రమంగా చేయడం లేదని ఎంపీ పేర్కొన్నారు. -8లో



భూసార పరీక్ష.. పంట దిగుబడికి రక్ష

భూసార పరీక్షలతో అధిక దిగుబడులను సాధించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయని వ్యవసాయ నిపుణులు తెలుపుతున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం 41.6/27.8

వాతావరణం

జిల్లాలో గురువారం 27.8 – 41.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.66 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: విజయవాడ కీట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డీడీయూ జీకేవై కార్యక్రమం ద్వారా వివిధ సాఫ్ట్‌వేర్ కోర్సులతోపాటు జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్ కోర్సులో ఆరు నెలల పాటు ఉచిత శిక్షణ, భోజన వసతి సౌకర్యం కల్పిస్తామని సంస్థ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ కేంద్రంలో ఇచ్చే శిక్షణలో ప్రతి విద్యార్థికి సీ, సీ++, జావా స్క్రిప్ట్, పైథాన్, వెబ్ డిజైనింగ్, జేఎస్‌డీ కోర్సులతోపాటు స్పోకన్ ఇంగ్లీషు, కంప్యూటర్ లైఫ్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తామని వివరించారు.అభ్యర్థులు 20–30 ఏళ్లలోపు కలిగి డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కోర్సులో చేసి ఉండాలన్నారు. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్



కడప అర్బన్: జాతీయ న్యాయసేవాధికారసంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మే 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు 08562 258622, 244622 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అలాగే కడప.డీకోర్ట్స్.జీఓవి.ఇన్, డిఎల్ఎస్ఏకేడిపి అట్‌దిరేటాఫ్ జి మెయిల్.కంలోనూ సంప్రదించవచ్చని వివరించారు.కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి పెంచలకోనకు ప్రత్యేక సర్వీసు



కడప కోటిరెడ్డి సర్కిల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు శుక్రవారం నుంచి రాజంపేట డిపోకు చెందిన ప్రత్యేక సర్వీసును నడపనున్నట్లు ఆర్టీసీ రాజంపేట డిపో మేనేజర్ రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు ఉదయం 5.15 గంటలకు రాజంపేటలో బయలుదేరి 6.30 గంటలకు కడప బస్టాండుకు చేరుతుందని పేర్కొన్నారు. అనంతరం 6.40 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి రాజంపేట, చిట్వేలి, రాపూరు మీదుగా ఉదయం 10.45 గంటలకు పెంచలకోనకు చేరుతుందని వివరించారు. తిరిగి 11.15 గంటలకు పెంచలకోనలో ఇదే మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం 1.45 గంటలకు రాజంపేటకు చేరుతుందని వివరించారు. తిరిగి 2.15 గంటలకు రాజంపేటలో బయలుదేరి రాపూరుకు 3.45 గంటలకు చేరుకోవడం జరుగుతుందని వివరించారు. 4.00 గంటలకు రాపూరులో బయలుదేరి చిట్వేలి, రాజంపేట మీదుగా కడపకు రాత్రి 7 గంటలకు చేరుకుంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యతనివ్వాలి



మాట్లాడుతున్న అగ్రికల్చర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవితేజ

ఒంటిమిట్ట: పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని సుస్థిర వ్యవసాయ సంస్థ అగ్రికల్చర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవితేజ పేర్కొన్నారు. గురువారం ఒంటిమిట్ట రైతు సేవా కేంద్రంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం సిక్రీస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ యాజమాన్య పద్ధతుల ద్వారా పండ్ల మొక్కల పెంపకంపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఒంటిమిట్ట, సుండుపల్లి, ఓబులవారిపల్లి మండలాలకు చెందిన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. మొక్కల పెరుగుదలకు పురుగులు, తెగుళ్ల నివారణకు పాటించాల్సిన సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి రవితేజ వివరించారు. మొక్కల ఎంపిక, నాటే విధానం, కొమ్మల కత్తిరింపు, నీటి యాజమాన్య పద్ధతుల గురించి సుస్థిర వ్యవసాయ సంస్థ ఆర్‌డబ్ల్యూఐ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ విద్యాసాగర్ వివరించారు.అలాగే మొక్కలు ఇచ్చిన పది మంది రైతులకు నవధాన్య కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సోషల్ మొబులైజర్ ఓబులేశు, ఏకశిలా ఎఫ్‌పీఓ చైర్మన్ సుబ్బరాయుడు, సుస్థిర వ్యవసాయ సంస్థ న్యాచురల్ ఫార్మింగ్ కో–ఆర్డినేటర్ అనుషా, ఎఫ్‌పీఓ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రియల్ రాబందులు

కడప నగరంలో రియల్ ఎస్టేట్ రాబందులు ఎక్కువయ్యారు. అక్రమంగా వెంచర్లు వేసి, అమాయకులకు ప్లాట్లు విక్రయించి, దొంగ సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసి మాయమైపోతున్నారు. ఇటీవలి కాలంలో ఇలాంటి కేసులు ఎక్కువవుతున్నాయి. సొంత ఇల్లు నిర్మించుకోవాలని ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఆడోళ్ల పుస్తెలు తాకట్టు పెట్టి తెచ్చిన డబ్బు.... వారి చేతుల్లో పెట్టి నష్టపోతున్నారు. ఇల్లు కట్టుకోలేక... ఇచ్చిన డబ్బు తిరిగి రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని అంగడి వీధిలో ఓ రియల్ ఎస్టేట్ రాబందు 90 మంది వద్ద సుమారు రూ.25కోట్లు తీసుకొని వారికి చుక్కలు చూపిస్తున్న వైనంపై ప్రత్యేక కథనం.

- అక్రమంగా వెంచర్లు వేయడం... జనం నుంచి డబ్బు గుంజడం
- దొంగ సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసి మాయం
- ఒక్క వెంచర్‌లోనే రూ.25 కోట్ల మేర ప్రజలకు టోకరా



సీఎంఆర్ పల్లిలోని ఎస్ఆర్ నగర్–2 వెంచర్

కడప కార్పొరేషన్: కడప నగరంలో తెలుగుగంగ కార్యాలయం గేటు ఎదురుగా సీఎంఆర్ పల్లిలో సర్వే నంబర్ 365–1లో ఎస్ఆర్ నగర్–2 వెంచర్‌లో 2021 సంవత్సరంలో భార్యాభర్తలు రాఘవరెడ్డి మణిప్రసాద్‌రెడ్డి, రాఘవరెడ్డి కవిత ఎలాంటి అనుమతులు పొందకుండా వెంచర్ వేసి అందులో 90 ప్లాట్లను ఏర్పాటు చేసి విక్రయించారు. సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని ఆలోచనతో చాలా మంది ఉద్యోగులు, ఉద్యోగ విరమణ పొందిన వారు, ప్రైవేటు ఉద్యోగులు ఈ ప్లాట్లను ఒక్కొక్కరు రూ.20లక్షలకుపైగా పెట్టి కొనుగోలు చేశారు. ఇంట్లో బంగారు తాకట్టు పెట్టి, బ్యాంకుల్లో దాచుకున్న డబ్బు డ్రా చేసి వారి చేతుల్లో పెట్టారు. బాధితుల నుంచి పూర్తి డబ్బు తీసుకున్న కవిత, మణిప్రసాద్ రెడ్డి రిజిస్ట్రేషన్ సమయంలో ఆ భూమికి సంబంధించిన సర్వే నంబర్ కాకుండా, దొంగ సర్వే నంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికి నాలుగేళ్లు కావొస్తున్నా తాము కొన్న ప్లాట్లలో ఇళ్లు కట్టుకోవడానికిగానీ, చదును చేసేందుకుగానీ వీలు కావడం లేదని బాధితులు వాపోతున్నారు. ఎందుకంటే కవిత ఎవరిదగ్గరైతే భూమి కొనుగోలు చేసిందో ఆ యజమాని సీఎంఆర్‌పల్లికి చెందిన రెడ్డెయ్యకు రూ.80లక్షలకు పైగా బకాయి ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే ప్లాట్లు కొన్నవారికి తెలియకుండా సదరు కవిత, మణిప్రసాద్‌రెడ్డి అనిల్ కుమార్ అనే మరో వ్యక్తి వద్ద సుమారు ఎకరా భూమిని ఆయకం పెట్టినట్లు సమాచారం. దీంతో ఆయకానికి పెట్టుకున్న వ్యక్తి ప్లాట్లు కొన్నవారికి ఇల్లు కట్టుకోవడానికి వీల్లేకుండా ఇబ్బందులు సృష్టిస్తున్న ట్లు తెలుస్తోంది.

రూ.25కోట్లకు పైగా మోసం

ఎస్ఆర్ నగర్–1, ఎస్ఆర్ నగర్–2, సంస్కృతి లే ఔట్, అపార్ట్‌మెంట్ల ద్వారా రూ.25కోట్లకు పైగా ప్రజలకు కుచ్చుటోపీ పెట్టినట్లు బాధితుల మాటల ద్వారా అర్థమవుతోంది.

ఇదొక్కటే కాదు కడప నగరంలో చాలామంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇదే తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. పట్టా భూములు కొనుగోలు చేసి వాటిని కన్వర్షన్ చేయకుండా, ప్లాన్ అప్రూవల్స్ పొందకుండా, ప్లాట్లను అభివృద్ధి చేయకుండా అమ్మేస్తున్నారు. పిల్లల భవిష్యత్ కోసమే, కుమార్తెల పెళ్లిళ్ల కోసమో స్థిరాస్తి ఉంటుంది కదా అని కొనుగోలు చేసేవారు ఇలాంటి మోసాల వల్ల సర్వం కోల్పోయి రోడ్డున పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అడ్వాన్సులు తీసుకుంటారు... చుక్కలు చూపిస్తారు



తక్కువ ధరలకే ప్లాట్లు విక్రయిస్తామని ప్రజలకు ఆశ కల్పిస్తున్న ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి దగ్గరినుంచి అడ్వాన్సుల రూపేణ ప్లాటు ధరలో 1/4 మొత్తం, 50 శాతం, లేదా పూర్తి మొత్తాన్ని తీసుకొని రిజిస్ట్రేషన్లు చేసి ప్లాట్లు స్వాధీన పరచకుండా మోసాలకు పాల్పడుతున్నారు. కడప–కర్నూలు జాతీయ రహదారి పక్కనే ఉన్న శేషయ్యవారిపల్లె వద్ద గ్లోబల్ వెంచర్‌లో కూడా ఇదే తరహా మోసం జరిగినట్లు తెలుస్తోంది.

అక్రమ వెంచర్... ఆపై కరువైన మౌలిక వసతులు

ఎవరైనా ఒక వెంచర్ వేయాలంటే ముందుగా నగరపాలక సంస్థ నుంచి ప్లాన్ అప్రూవల్ పొందాలి. 30 అడుగుల సిమెంటు రోడ్లు, తాగునీటి పైపులు, కాలువలు, గ్రీనరీ పెంపొందించాల్సి ఉంటుంది. కానీ ఎస్ఆర్ నగర్–2 వెంచర్‌లో నాలుగు సిమెంటు రోడ్లు మినహా ఎలాంటి వసతులు లేవు. అందులో ఒక రోడ్డు మాత్రమే 30 అడుగుల వెడల్పు ఉంది. నగరపాలక సంస్థ అప్రూవల్ అసలే లేదు. అయినా సెంటు ధర రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షలే కదా అనే చాలామంది 4 సెంట్లు, 5 సెంట్ల ప్లాట్లను కొనుగోలు చేశారు. 2021లో వారు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పటి నుంచి వెంచర్‌ను అభివృద్ధి చేసి, తాము ఇళ్లు నిర్మించుకోవడానికి వీలుగా చేయాలని ఎన్నిసార్లు ఫోన్ చేసినా, మెసేజీలు పెట్టినా స్పందించలేదని సమాచారం. చివరకు ప్లాట్లు కొన్న వారంతా ప్రొద్దుటూరులోని వారి ఇంటికి కూడా అనేకసార్లు వెళ్లి అడిగినట్లు తెలిసింది. ఇంట్లో అందుబాటులో లేకుండా, ఫోన్‌లకు స్పందించకపోవడంతో బాధితులంతా జిల్లా ఎస్పీలను కలిసి తమ గోడు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. వారిపై 420 కేసు నమోదు చేయడం మినహా మరేమీ చేయలేమని పోలీసులు చేతులెత్తేయడంతో బాధితులు ఏం చేయాలో తెలియక లోలోపలే కుమిలిపోతున్నారు. శ్రీసాయి ఫార్చ్యూన్స్ వారు ఎస్ఆర్ నగర్–1, ఎస్ఆర్ నగర్–2, అలంఖాన్‌పల్లె వద్ద సంస్కృతి వెంచర్, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ పక్కన అపార్ట్‌మెంట్ నిర్మించి అనేక మందికి ప్లాట్లు విక్రయించినట్లు సమాచారం. సమగ్ర విచారణ చేస్తే బాధితులు ఎక్కువ సంఖ్యలో బయటికి వచ్చే అవకాశముంది.



మాట్లాడుతున్న ప్లాట్లు కొన్నవారు

దొంగ సర్వే నంబర్ వేసి మోసం చేశారు



మాది చక్రాయపేట మండలంలోని గంగారపువాండ్ల పల్లె గ్రామం. జిల్లా కేంద్రమైన కడపలో సొంత ఇల్లు ఉంటే బాగుంటుందనే ఉద్దేశ్యంతో 2021లో శ్రీ సాయి ఫార్చ్యూన్స్ పార్టనర్ అయిన ఆర్. కవిత, ఆమె భర్త ఆర్. మణి ప్రసాద్‌రెడ్డిల వద్ద నాలుగున్నర సెంట్ల ప్లాటు కొనుగోలు చేశాను. రిజిస్ట్రేషన్ సమయంలో తప్పుడు సర్వే నంబర్ వేశారు. మేము రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నారు కదా అని సరిగ్గా చూసుకోలేదు. ప్లాటు అప్పగించమంటే ఫోన్లు ఎత్తడం లేదు. – శివకొండారెడ్డి

పోలీసులు రక్షణ కల్పించాలి



మణి ప్రసాద్‌రెడ్డి, కవిత వల్ల చాలామంది మోసపోయారు. ఫోన్లు చేస్తే ఎత్తరు, ఇంటికిపోయినా సరిగా స్పందించరు. నాలుగేళ్లు గడిచిపోయాయి. ఇప్పటికైనా మేము ఇల్లు కట్టుకునేలా పోలీసులు రక్షణ కల్పించాలి. వారు బకాయి ఉన్నదానికి మమ్మల్ని ప్లాట్లలోకి రానీకుండా అడ్డుకోవడం సరికాదు. సొంత ఇల్లు లేక, కట్టిన డబ్బు వెనక్కి రాక చాలా ఇబ్బందులు పడుతున్నాం. – బాలయ్య

పనులు ప్రారంభించాలనుకుంటే అడ్డుపడుతున్నారు



మేము ఈ వెంచర్‌లో 19,47,48 ప్లాట్లు కొనుగోలు చేశాము.అప్పుసప్పు చేసి లక్షల రూపాయలు వారి చేతిలో పెట్టాం. ఇప్పుడు ఇల్లు కట్టుకోవాలని ఇసుక, కంకర తెచ్చి పనులు మొదలు పెడదామంటే ఎవరో ఒకరు వచ్చి అడ్డుపడుతున్నారు. మాకు తెలియకుండా ఎవరికో ఆయకానికి పెట్టారట ఆయన వచ్చి ఈ ఎకరం స్థలం నాది అంటాడు. మరి ప్లాట్లు కొన్న మా పరిస్థితి ఏంటి. ఈ విషయంలో ఎవరూ న్యాయం చేయడం లేదు. – ఓబులేసు, అంగడి వీధి.

జూనియర్ కళాశాలల అభివృద్ధికి కృషి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని ప్రభుత్వ కళాశాలల్లో విద్యతోపాటు కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తామని ఇంటర్ ఎఫ్ఏసీ ఆర్‌జేడీ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఎఫ్ఏసీ ఆర్‌జేడీగా శ్రీనివాసులు గురువారం కడప ఇంటర్ ఆర్‌జేడీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు డీఐఈఓగా నియమితులైన శ్రీనివాసులను ఎఫ్ఏసీ ఆర్‌జేడీగా ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ఆయన గురువారం ఇంటర్ ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టారు. నూతన ఆర్‌జేడీ, డీఐఈఓలను ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో సంఘ నేతలు ఘనంగా సన్మానించారు.



ఇంటర్ ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులను సన్మానిస్తున్న రామక్రిష్టారెడ్డి తదితరులు

ఇంటర్ డీఐఈఓగా సత్యనారాయణరెడ్డి



కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ విద్య అభివృద్ధి కోసం అందరి సహకారంతో కృషి చేస్తామని డిస్ట్రిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీఐఈఓ) సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఇంటర్ డీఐఈఓగా సత్యనారాయణరెడ్డి గురువారం కడపలోని ఆర్ఐఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎన్టీఆర్ జిల్లా పయాకపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో హజ్ కమిటీ ద్వారా గురువారం స్థానిక రాధాకృష్ణనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ 125 మందికిగాను 115 మందికి వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. ఇంకా ఈ టీకాలు వేయించుకోని హజ్ యాత్రికులకు తిరిగి ఈనెల 28న టీకాలు వేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఐఓ ఉమామహేశ్వరకుమార్, డీఎల్ ఏటీఓ డాక్టర్ రవిబాబు, యూపీహెచ్‌సీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ సుమధుర, సూపర్‌వైజర్ మహబూబ్‌బాష పాల్గొన్నారు.



హజ్‌యాత్రికులకు టీకాలు వేస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

ఎంఎస్ఎంఈల సాధికారతతో రాష్ట్రాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ , చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు

మంత్రి శ్రీనివాస్

కడప సెవెన్‌రోడ్స్: సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల సాధికారతతోనే రాష్ట్ర సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధ్యమవుతుందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు, ఎంఎస్ఎంఈల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా రాణించాలన్నారు. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లా నుంచి ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు, బెరైటీస్, బేరియం క్లోరైడ్ వంటి ఉత్పత్తులు అధికంగా ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ ఇండస్ట్రీలో మ్యాన్ పవర్ అవసరం చాలా ఎక్కువగా ఉందన్నారు. స్థానిక యువత అందుబాటులో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, కృష్ణ చైతన్యరెడ్డి మాట్లాడారు. టిక్కి ఆర్గనైజేషన్ ప్రతినిధి రామ్మూర్తి నాయక్, డిక్కి కో–ఆర్డినేటర్ శివశంకర్, ఫ్యాప్సియా ప్రతినిధి గల్లా శ్రీధర్, జ్ఞాన ప్రకాశ్‌లతో పాటు ఏపీఐఐసీ, పరిశ్రమలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌పై అపోహలు వద్దు

కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌పై జిల్లాలో అపోహలు వద్దని ఎంఎస్ఎంఈ, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. టెక్నాలజీ సెంటర్‌ను ఇక్కడే ప్రతిపాదించామని చెప్పారు. పీపీపీ మోడల్‌లో టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామిని గుర్తించే పనిలో ఉందని తెలిపారు. మే 1వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో 10 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభిస్తారని చెప్పారు. వైఎస్సార్ జిల్లాలో ఒక ఎంఎస్ఎంఈ పార్కుకు ప్రారంభోత్సవం చేస్తామని, మరో రెండు పార్కులకు భూమిపూజ నిర్వహిస్తామని వెల్లడించారు. ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు జిల్లాలో ఉన్న అవకాశాలు, వాటిని ఎలా ప్రమోట్ చేయాలో కార్యాచరణ రూపొందించేందుకు జిల్లా పర్యటనకు వచ్చామన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్, డిక్కీ, సిక్కి, టిక్కి, కొప్పర్తి ఐలా ప్రతినిధులతో సమావేశమై ఫిర్యాదులు స్వీకరించామన్నారు.

› కలెక్టర్ గారూ.. ఇదేమిటి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారిక హోదాలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి సైతం పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఆయనకు ఎలాంటి ప్రభుత్వ హోదా లేకపోయినా వేదికపై కూర్చోవడం, అందుకు కలెక్టర్ శ్రీధర్ కూడా ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. గతంలో కూడా డీఆర్సీ సమావేశాల్లో పాల్గొన్నప్పుడు విమర్శలు వచ్చాయి.

ఏపీఐఐసీ నుంచి సేల్ రిజిస్ట్రేషన్లు చేయించండి

కడప కార్పొరేషన్: సేల్ రిజిస్ట్రేషన్ల సమయంలో ఏపీఐఐసీ నుంచి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని మైదుకూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిశ్రమల యజమానులు కోరారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను వారు కొప్పర్తి పారిశ్రామికవాడలో కలిసి వినతి పత్రం అందజేశారు.సూక్ష్మ పరిశ్రమలకు పీఎఫ్, ఈఎస్ఐలతో నిమిత్తం లేకుండా ఏపీఐఐసీ సేల్ రిజిస్ట్రేషన్లు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కొప్పర్తి, మైదుకూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రతినిధులు పల్లేటి రమణారెడ్డి, మదన్‌కుమార్, కిశోర్‌బాబు, కేవీ సురేష్ పాల్గొన్నారు.

శభాష్.. ఆచార్యా!

పుస్తకాలు చేతబట్టి పొలాలు వల్లెవేసిన పల్లెటూరి పిల్లాడు.. నేడు అవే పుస్తకాలు చేతబట్టి విద్యార్థులకు బోధిస్తూ..

తన పరిశోధనలతో దేశ, విదేశాల్లో ఖ్యాతిని ఆర్జిస్తూ పుట్టినగడ్డకు పేరు ప్రఖ్యాతులు తీసుకువస్తున్నాడు. తాజాగా రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో ఫెలోగా నియమితులు కావడంతో పాటు సంస్థ రాయల్‌సొసైటీ బ్యాడ్జిని అందుకున్నాడు. ఆయనే ఆచార్య సుధాకర్ రెడ్డి.

- కడప ఆచార్యుడు సుధాకర్ రెడ్డికి అరుదైన గౌరవం
- పలు పేటెంట్లు కైవసం
- దేశ, విదేశాల్లో పరిశోధన



యూకే పేటెంట్‌ను నాగ్‌పూర్ ప్రొఫెసర్ దోల్గే, వైవీయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి నుంచి అందుకుంటున్న ఆచార్య బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి



డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: చింతకొమ్మదిన్నె మండలం గూడావాండ్లపల్లెకు చెందిన సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన బుసిరెడ్డి మల్లారెడ్డి, మల్లమ్మల కుమారుడైన డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రాథమిక విద్య బయనపల్లె ఎస్.వి. హైస్కూల్‌లో పూర్తి చేశాడు. అనంతరం డాక్టర్ పంగ్రా కోటేశ్వరమ్మ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఎస్.వి. డిగ్రీ కళాశాలలో డిగ్రీ, తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేశారు. అనంతరం తాను చదివిన ఎస్.వి. డిగ్రీ కళాశాలలోనే అధ్యాపకుడుగా ప్రస్థానం ప్రారంభించారు. ప్రస్తుతం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో భౌతికశాస్త్ర ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

పరిశోధనల్లో ఘనాపాటి..

డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి పరిశోధన రంగంలో తనదైన శైలిలో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే ఆయనకు రెండు యూకే పేటెంట్లు ఉండగా, 75 పైగా అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. 2008లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న ఈయన 2017లో ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారాన్ని అందుకున్నాడు. 2018లో ఎస్ఈఎస్ఏ ఫెలోగా పరిశోధనలో ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నాడు. అదే ఏడాది విశిష్ట ప్రొఫెసర్ అవార్డును, 2024లో జాతీయ అధ్యాపక అవార్డును అందుకున్నారు. అదే విధంగా నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ (న్యాక్) కమిటీ మెంబర్‌గా కూడా వ్యవహరించారు. ఏడీ ర్యాకింగ్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తల జాబితాలో భారతదేశం నుంచి ఎంపికైన అతికొద్ది మంది భౌతికశాస్త్రవేత్తలో ఈయన ఒకరుగా నిలిచారు. ఇప్పటివరకు ఈయన 101 జర్నల్స్, 3 పుస్తకాలు, కోట్లాది రూపాయలు విలువ చేసే 6 ప్రాజెక్టులు పూర్తి చేశారు.

రెండు పేటెంట్లు...

'డివైజ్ ఫర్ కంట్రోలింగ్ ది స్టెమ్ బోరర్ ఇన్‌సెక్ట్ ఇన్ క్రాప్ మేనేజ్‌మెంట్'అన్న అంశంపై ఈయన పరిశోధన వ్యాసానికి 2025 జూలై 10వ తేదీన యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన కంప్ట్రోలర్ జనరల్‌ఆఫ్ పేటెంట్స్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ వారు పేటెంట్ సర్టిఫికెట్ (పేటెంట్ నెంబర్ 6377539) అందజేశారు. ఈ పరిశోధనల ద్వారా ఎల్ఈడీ, నూనెలను ఉపయోగించి కీటకాలను రెండు విధాలుగా ఆకర్షించడానికి వినూత్న పరికరాన్ని రూపొందించారు. అదే విధంగా వేస్ట్ హెచ్‌జీ బేస్డ్ ల్యాంప్స్ కలెక్టింగ్ డివైజ్‌పై చేసిన పరిశోధనకుగాను పేటెంట్ నెంబర్ 6404043ను 2024 నవంబర్ 22న పొందారు.



2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకుంటూ..

రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో ఫెలోగా..

ప్రపంచవ్యాప్తంగా 50వేల మంది సభ్యులుగా ఉండే రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో ఫెలోగా అవకాశం దక్కించుకున్న ఈయన తాజాగా సొసైటీ వారు మెటీరియల్ కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాల్లో చేసిన ప్రతిభను గుర్తించి ఎఫ్ఆర్ఎస్‌సీ (ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ) అందించారు. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను, అదే విధంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే 'రాయల్ సొసైటీ బ్యాడ్జి'ను డా. బుసిరెడ్డికి పంపడం విశేషం.

›› పాఠాలు చెప్పిన అధ్యాపకులకే గైడ్‌గా..

తనకు డిగ్రీలో పాఠాలు చెప్పిన అధ్యాపకులు పి. గిరిధర్, భూషణ్‌రెడ్డిలకు.. తర్వాత కాలంలో ఆయనే వారికి గైడ్‌గా వ్యవహరించి పీహెచ్‌డీలు అందించారు. ఇప్పటి వరకు 8 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ గైడ్ వ్యవహరించి వారికి డాక్టరేట్ రావడంతో కృషిచేశారు. ప్రస్తుతం మరో ఇద్దరు పరిశోధకులు ఈయన వద్ద పరిశోధనలు చేస్తున్నారు. 2010లో తొలుత విదేశాల్లో పరిశోధనలు ప్రారంభించిన ఈయన ఇప్పటి వరకు సౌత్‌కొరియా, హాంకాంగ్, స్వీడన్, ఫిన్‌లాండ్, సౌత్ ఆఫ్రికా దేశాల్లో పరిశోధనలు చేశారు.

అంధుల ప్రభుత్వ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత

కడప ఎడ్యుకేషన్ : కడప శంకరాపురం ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాల పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ పాఠశాల నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను నలుగురు పరీక్ష రాయగా నలుగురు ఉత్తీర్ణులై వందశాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో దువ్వూరు గురమ్మ 323 మార్కులు, మంగోని స్వర్ణలత 322 మార్కులు, బాతల రెవంత్‌కుమార్ 321 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో(ఫస్ట్ క్లాస్) నిలువగా, లింగాల నందీశ్వరెడ్డి 229 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో (సెకెండ్ క్లాస్) నిలిచారు. తమ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ప్రధానోపాధ్యాయుడు ఎబినైజర్ హర్షం వ్యక్తం చేశారు.

వేంపల్లి శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం



పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులతో శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె : పదవ తరగతి పరీక్షా ఫలితాలలో స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి తెలిపారు. ఈ పరీక్ష ఫలితాలలో జి సాయినాథ్ 600/597 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడవ స్థానం, జిల్లా స్థాయిలో రెండవ స్థానం సాధించారన్నారు. అలాగే పి. గురుభావన 595, బి.వి ఉదయ్ అర్జున్ 592లు సాధించారని తెలిపారు. అలాగే 590కిపైగా 40 విద్యార్థులు, 580-590 మధ్య మార్కులు 7 మంది విద్యార్థులు, 550-580 మార్కుల మధ్య 32 మంది విద్యార్థులు రాణించారన్నారు. మొత్తం 155 మంది విద్యార్థులు హాజరు కాగా, 500 మార్కులకు పైగా 95 మంది విద్యార్థులు సాధించారన్నారు.

రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు

కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల టౌన్ : గత ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ జరిగేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారులు, కూటమి నాయకులు కుమ్మక్కై, రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా చేయడం లేదని, ఇందులో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో నూతన కోనేరు ప్రారంభానికి వచ్చిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో ఎండీయూ ఆపరేటర్లు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ వెంటనే కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ఫోన్ చేసి సమస్యను విన్నవించారు. గతంలో మాదిరి రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ జరగడంలేదని, ఎంతోమంది లబ్ధిదారులు కూడా ఈ విషయాన్ని తమ దృష్టికి తెచ్చారన్నారు. బియ్యం పంపిణీ ఒకట్రెండు రోజులు చేసి లేవని చెబుతున్నారని, కొందరికి రెండు, మూడు కేజీల బియ్యం తక్కువగా వస్తున్నాయన్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. ఎండీయూ ఆపరేటర్లను భయానికి గురి చేసి బియ్యం పంపిణీ వద్ద లేకుండా చేసి ఇష్టానుసారంగా రేషన్ పంపిణీ చేస్తున్నారని.. దీనిపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో వివరించారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ జేసీతో మాట్లాడి సక్రమంగా పంపిణీ జరిగేలా చూస్తామన్నారు. ఎంపీ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాణితోపును అద్భుతంగా తీర్చిదిద్దామని.. దాన్ని ప్రస్తుత ప్రభుత్వం మెయింటెనెన్స్ చేయలేకపోతోందని, ఉలిమెల్ల లేక్ వ్యూను మెయింటెనెన్స్ చేయలేక శిల్పారామానికి ఇచ్చారన్నారు. అరటి రైతుల కోసం రూ.25కోట్లతో గత ప్రభుత్వంలో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజ్‌ను నిర్మించామని, ప్రస్తుత ప్రభుత్వం ఆ స్టోరేజ్‌ను వినియోగంలోకి కూడా తీసుకురాలేదన్నారు. అలాగే వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఐదంతస్తుల భవనంతోపాటు క్రీడా మైదానాన్ని అత్యాధునికంగా నిర్మించామని, ఇప్పటికీ కూడా వినియోగంలోకి తీసుకరాలేదన్నారు. పులివెందులకే తలమానికమైన మెడికల్ కాలేజీను రూ.350కోట్లతో నిర్మిస్తే ప్రస్తుత ప్రభుత్వం మంజూరైన సీట్లను రద్దు చేసిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యాభ్యాస్యం ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

ఉగ్రవాదుల దాడి అత్యంత బాధాకరం

పులివెందుల : కాశ్మీర్‌లో టూరిస్టులపై ఉగ్రదాడి అత్యంత హృదయ విదారకమైన సంఘటన అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. గత కొన్నేళ్లుగా దేశంలో ప్రశాంత వాతావరణం ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో ఉగ్రదాడి జరగడం చాలా బాధాకరమన్నారు. పులివెందులలో గురువారం ఆయన మాట్లాడుతూ కాశ్మీర్ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతోందని, అక్కడ మినీ స్విట్జర్లాండ్ వాతావరణ పరిస్థితులు ఉంటాయన్నారు. అక్కడికి మన దేశ ప్రజలే కాకుండా, ఇతర దేశాల ప్రజలు కూడా వస్తారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉగ్రవాదులు దాడి చేయడం వలన టూరిజం వ్యవస్థ కూడా దెబ్బతింటోందన్నారు. ఆ సంఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు చూస్తుంటే మనసు కలచివేసిందన్నారు. ఉగ్రదాడిపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఆ ఘటనకు పాల్పడిన ఉగ్రవాదులు ఏ గ్రూపునకు చెందిన వారైనా, వారిపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఉగ్రవాదులు చేసిన చర్యకు ప్రతి చర్యగా గట్టిగా సమాధానం ఇవ్వాలన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి



గాయపడిన రమణయ్య

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని భారత్ పెట్రోలు బంకు సమీపంలో బుధవారం అర్ధరాత్రి బాకీ విషయమై ఓ వ్యక్తి మరో వ్యక్తిపై కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కోటిరెడ్డినగర్‌కు చెందిన రమణయ్య లారీడ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. కడపకు చెందిన లారీ ఓనర్ దస్తగిరి అనే వ్యక్తి వద్ద రమణయ్య డ్రైవర్‌గా వస్తానని నమ్మబలికించి కొంత నగదును అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. అయితే లారీకి డ్రైవర్‌గా వెళ్లకుండా.. డబ్బులు తిరిగి చెల్లించకుండా కాలయాపన చేస్తుండటంతో బుధవారం దస్తగిరి బద్వేలుకు వచ్చి రమణయ్యను నిలదీశాడు. ఈ సమయంలో ఇరువురి మధ్య మాటమాట పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో దస్తగిరి తన వద్ద ఉన్న కత్తితో రమణయ్యను కడుపు భాగంలో, వీపు భాగంలో పొడిచాడు. ఇంతలో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని రక్తగాయాలైన రమణయ్యను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. దస్తగిరిని అదుపులోకి తీసుకున్నారు.

వాహనాలు స్వాధీనం

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా రికార్డులు లేని 51 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధ, గురువారాల్లో మొత్తం 108 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనుమానితులు, పాత నేరస్తుల ఇళ్లలో తనిఖీలు చేశారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కడప టూ టౌన్ పి.ఎస్ పరిధిలోని బిస్మిల్లా నగర్‌లో నిర్వహించిన కార్డన్ అండ్ సర్చ్ లో 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కడప టూ టౌన్ సి.ఐ బి.నాగార్జున, ఎస్.ఐలు హుస్సేన్, సిద్దయ్య, చిన్నచౌక్ ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో గత నెల 23న గుర్తు తెలియని వ్యక్తి (35) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వచ్చాడు. అతను చికిత్స పొందుతూ ఈనెల 23న మృతి చెందాడు. అతని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తమను తగిన ఆధారాలతో సంప్రదించాలని రిమ్స్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఉచిత శిక్షణ వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న డిప్యూటి ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ అభ్యర్థులకు వరంలాంటిదని కడప ఉప విద్యాశాఖాధికారి జి.రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో జరిగిన డీఎస్సీ ఉచిత కోచింగ్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని నిర్వహిస్తున్నదని, కేవలం 45 రోజులు మాత్రమే పరీక్షలకు సమయం ఉందన్నారు. ఈ పరిస్థితులలో డీఎస్సీ అభ్యర్థులు కోచింగ్ కోసం వేలాది రూపాయలను వెచ్చిస్తూ, సుదూర ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన అవసరం లేకుండానే కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ఉచితంగా కోచింగ్ ను నిర్వహించడం అభినందనీయమన్నారు. డీఎస్సీ అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదివి, ఆత్మస్థైర్యంతో ముందుకు వెళితే అద్భుత ఫలితాలను పొందవచ్చని పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, మహేష్ బాబు మాట్లాడుతూ విద్యా రంగ పరిరక్షణ కోసం యూటీఎఫ్ తన వంతు పాత్ర పోషిస్తోందన్నారు. డీఎస్సీ కోచింగ్‌లో శిక్షణ ఇచ్చే అధ్యాపకులు వి.బ్రహ్మయ్య, కోవెల ప్రసాద్ రెడ్డి, కె.సత్యానందరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, మహేష్, ప్రభాకర్, జి.గోపీనాథ్ లు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.సుదర్శన్ రెడ్డి, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

బస్సులో వెళుతూ వడదెబ్బతో మహిళ మృతి



మృతి చెందిన భవాని



108 వాహనంలో కూర్చొని ఉన్న చిన్నారి

సింహాద్రిపురం : మండలంలోని బలపనూరు గ్రామంలో గురువారం బస్సులో ప్రయాణిస్తున్న మహిళ వడదెబ్బకు గురై మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మృతురాలి అల్లుడు శివ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాడిపత్రి నుంచి పులివెందులకు వస్తున్న ఆర్టీసీ బస్సులో యనమల భవాని(50) తన మనవరాలితో బయలుదేరింది. మధ్యాహ్నం సమయంలో బస్సులో మనుమరాలు ఏడుస్తున్నా భవాని నుంచి ఉలుకు పలుకు లేకపోవడంతో తోటి ప్రయాణీకులు ఆమెను లేపడంతో భవాని అక్కడే కుప్పకూలారు. దీంతో తోటి ప్రయాణీకులు ఆమెను 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే వడదెబ్బకు గురై మృతి చెందినట్లు నిర్ధారించారు.

గండికోట నుంచి కొనసాగుతున్న ఔట్ ఫ్లో

కొండాపురం : గండికోట జలాశయం నుంచి గండికోట ఎత్తిపోతలపథకం నుంచి మూడు మోటర్లతో పైడిపాళెం జలాశయంకు 300 క్యూసెక్కుల నీటిని కొనసాగిస్తున్నట్లు జీఎన్ఎస్ఎస్ ఈఈ ఉమామహేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట జలాశయంలో 18.5 టీఎంసీలు నిల్వ ఉన్నాయన్నారు. గాలేరి నగరి సృజల స్రవంతి ప్రధాన కాలువకు 300 క్యూసెక్కుల నీటిని శెట్టివారిపల్లె మెయిన్ రెగ్యులేటర్ ద్వారా సర్వరాయ సాగర్ కు ఔట్ ఫ్లో కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాన కాలువ నుంచి రైతాంగానికి సాగునీరు అవసరాల కోసం వదిలినట్లు ఆయన తెలిపారు. గండికోట నుంచి మైలవరం జలాశయంకు ఒక టీఎంసీ తరలించామని, కాగా గురువారం మధ్యాహ్నానికి నీటిని నిలుపుదల చేశామన్నారు.

భార్యను బ్లేడ్‌తో గొంతుకోశాడు

సైదాపురం : భార్య భర్తల మధ్య మనస్పర్థల కారణంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో ఓ వ్యక్తి మంగళవారం రాత్రి బ్లేడుతో భార్య గొంతును కోశాడు. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. ఈఘటనపై గురువారం పోలీసులు నమోదు చేశారు. ఎస్ఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కడప పట్టణంలోని శివానందపురానికి చెందిన ఊటుకూరు విష్ణుకు సైదాపురం మండలంలోని కలిచేడు గ్రామానికి చెందిన ప్రసన్నతో వివాహం జరిగింది. ప్రస్తుతం వారు కలిచేడు గ్రామంలో కాపురం ఉంటున్నారు. ఇటీవల భార్య భర్త మధ్య కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. దీనికి తోడు భార్యపై అనుమానం పెనుభూతంగా మారింది. ఈనెల 22 వతేదీ రాత్రి 11 గంటల సమయంలో విష్ణు బ్లేడు తీసుకుని భార్య ప్రసన్న గొంతుపైన, గడ్డంపై, కుడిచేయి భుజంపైన కోశాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితురాలును కుటుంబ సభ్యులు నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసును నమోదుచేసి పరారీ ఉన్న విష్ణు ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుట్టాయపల్లెలో ఉద్రిక్తత



బాధితుల పక్షాన అధికారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని పుట్టాయపల్లెలో ఆక్రమణల తొలగింపు విషయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఓ వర్గానికి చెందిన గ్రామస్తుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ స్థలాలపై మాత్రమే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఉద్రిక్తతకు దారితీసింది. చివరకు పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు ఇరువర్గాల వారితో చర్చించి ఆక్రమణల తొలగింపునకు 15 రోజులు గడువు ఇవ్వడంతో సమస్య సద్దుమనిగింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. పుట్టాయపల్లెలో గల పలు సర్వే నెంబర్లలో చెరువు పోరంబోకు స్థలాలు, రస్తాలు, గ్రామకంతాలు, కాలువలు ఆక్రమణకు గురయ్యాయని గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు హైకోర్టులో కేసు దాఖలు చేశారు. ఈ మేరకు హైకోర్టు ఆక్రమిత భూములు స్వాధీనం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలో గురువారం పుట్టాయపల్లె పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, రూరల్ పోలీసుల సహకారంతో ఆక్రమణలను తొలగించేందుకు గ్రామానికి వెళ్ళారు. ఈ సమయంలో గ్రామస్తులు గత 35 ఏళ్లగా ఆయా సర్వే నెంబర్లలోని ప్రభుత్వ స్థలాల్లో వామిదొడ్లు, పశువుల పాకలు, ఇల్లు నిర్మించుకుని ఉన్నామని, ఇప్పుడు ఉన్నపలంగా ఓ వర్గానికి చెందిన వారి ఆక్రమణలు మాత్ర మే తొలగించాలని నిర్ణయం తీసుకోవడం సరికాదని, తమ కు కొద్ది రోజులు సమయం ఇవ్వాలని కొందరు గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. అంతేకాకుండా హైకోర్టుకు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకుల వర్గీయులు గ్రామంలోని పలు సర్వేనెంబర్లలో చెరువు స్థలాలు, గ్రామకంతాలను ఆక్రమించి పంటలను సాగు చేయడంతో పాటు ఇల్లు నిర్మించుకున్నారని, వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకుపోయారు. దీంతో చేసేదేమీ లేక ఇరువర్గాల వారితో చర్చలు జరిపి 15 రోజులు గడువు ఇవ్వడంతో సమస్య సద్దుమనిగింది. ఇదే సమయంలో గ్రామానికి చెందిన జెడ్పీటీసీ సభ్యులు చిన్నపోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపోలిరెడ్డి, సర్పంచ్ జయరామిరెడ్డిలు జిల్లా పరిషత్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమయం ఇచ్చేలా స్థానిక అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జల్ జీవన్ ప్రాజెక్టు పూర్తి చేయాలి



కె.ఎర్రగుడి గ్రామ సభలో ప్రజల నుంచి సమస్య తెలుసుకుంటున్న కేంద్ర కమిటీ అధికారి విజయకుమార్

చక్రాయపేట : జల జీవన్ మిషన్ కింద చేస్తున్న పనులను ఆగస్టు నాటికి పూర్తి చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు నీటిని అందించాలని నేషనల్ వాష్ ఎక్స్‌పర్ట్ (కేంద్ర పరిశీలన కమిటి) హర్యాణ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ విజయకుమార్ సంబంధిత పనులు చేస్తున్న మెగా కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. గురువారం మండలంలోని కె.ఎర్రగుడి, కల్లూరుపల్లె గ్రామాల్లో జలజీవన్ మిషన్ కేంద్ర కమిటీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ ప్రాజక్టు కింద చేస్తున్న పనులను పరిశీలించారు. అనంతరం వారు సర్పంచులు హరిశేఖర్‌నాయుడు, నాగరత్నమ్మల ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం, నీటి సమస్య తదితరాలపై ఆరా తీశారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లో బోర్లు వేయాలంటే ఎంత మేర ఖర్చు వస్తుంది. ఎంత లోపల నీరు ఉంది. నీటిలో ఫ్లోరైడ్ ఉందా.. వాటి పరీక్షలు నిర్వహిస్తున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. నీటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయ భాస్కర్, డీఈ సాలన్న తదితరులు పాల్గొన్నారు.

మనస్థాపంతో విద్యార్థిని మృతి

ములకల చెరువు : పదో తరగతిలో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని సెంట్రల్ స్కూల్ పంచాయతీ పెద్ద మొరవ పల్లికి చెందిన చల్లా రెడ్డప్ప కుమార్తె చల్లా నవీన(15) పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయింది. దీంతో మనస్థాపానికి చెందిన నవీన గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు.